(152–వ పేజి తరువాయి)

# ఉ యం ఉంటే……

బొడ్డుపల్లి కృష్ణావధాని

ఒక రోజున వస్తాదొకడు వచ్చి కొలువు తీరి యున్న రాజుతో "రాజా! నేను ఎన్నెన్నో అద్భుత కార్యాలు చేయగలను. ఎటువంటి అసాధ్యమైన పనులనైన చేయగలను పర్వతాలను సయితము మోయగలను" అన్నాడు,

"అలాగా! అయితే సమీపముననున్న పర్వతమును మోయగలవా" అని అడిగాడు.

"అదెంతపని! కాని నేను యీ మధ్య జబ్బుపడి లేచాను. ఇంకా పుష్టి సమకూరలేదు. మీరు నెల రోజులు మంచి ఆహారసదుపాయములను సమకూర్చినచో నేనా పర్వతమును అవలీలగా మోయగలను"

రాజు మంత్రిని పిలచి "ఈ వస్తాదుకు నెల రోజులు కావలసిన ఆహారసదుపాయములను ఏర్పాటు చేయండి" అని ఉత్తరువు చేసెను.

నెల రోజులు వస్తాదుకు కోరిన ఆహారవసతులు తృప్తిగా సమకూర్చబడినవి. పీనుగ ఆకారంతో వచ్చిన వస్తాదు ఏనుగలాగ తయారయ్యాడు.

నెల రోజుల తర్వాత ఒకరోజున పర్వతము చెంత రాజు మంత్రులు, సామంతులు, ప్రజలు సమావేశమయి వస్తాదును పిలిపించి పర్వతమును మోయమన్నాడు రాజు.

అక్కడున్నవారంతా పర్వతాన్ని ఆ వస్తాదు ఎలాగ మోస్తాడో చూద్దామని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. వస్తాదు ఒకసారి చుట్టూయున్నవారిని కలయచూచి "ప్రజలారా! మీరంతాకలసి యీ పర్వతాన్ని ఎత్తి నా తలమీద పెట్టండి! నేను మోస్తాను" అన్నాడు.

రాజు నిర్ఘాంతపోయి "వస్తాదూ! నెలరోజుల గడువుకాగానే కొండను మోస్తానంటివికదా! యిదేమిటి?" అన్నాడు.

అందుకా వస్తాదు "ఓ రాజా! కొండను మోసెదనంటినేకాని ఎత్తుదుననలేదుకదా! ఇప్పుడైనా కొండను ఎత్తి నా తలమీద పెడితే తప్పకుండా మోస్తాను" అన్నాడు.

ప్రజలు, మంత్రులు ఆ మాటలువిని కొండ నెత్తగలవారెవ్వరూ లేనప్పుడు అతనిని మోయమనడం పొరబాటని గుర్తించారు.

రాజు వస్తాదు యుక్తికి సత్కరించి పంపేశాడు.

బాలలూ! వస్తాదు యుక్తి ఎంత గొప్పదో చూచారు కదూ!

# రావుజీ — పైజమా

M. V. కేశవగోపాల్

రావుజీ తాలూకాఫీసులో ఓ గుమాస్తా. ఒకసారి వారి ఆఫీసుకు అధికారి ఒకాయన వస్తాడని తెలిసింది. అధికారి దగ్గరకు వెళ్ళాలంటే మాంచి డ్రస్సుండాలి! అందుకని రావుజీ ఓ వారం రోజులు ముందుగానే దర్జీకి ఓ పైజామాకు, షర్టుకు గుడ్డ ఇచ్చాడు. రేపు అధికారిని రావ్‌జీ చూడబోతాడనగా, ఆదినం మధ్యాహ్నం దర్జీ గుడ్డలు ఇంట్లోఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో రావ్‌జీ ఇంట్లోలేడు. సాయంత్రం తిరిగి వచ్చాక పైజమా ఉండవలసిన కొలతకంటె రెండు అంగుళాలు పొడవెక్కువగా ఉండటం గమనించాడు.

భార్య దగ్గరకెళ్ళి, "చూడు? దర్జీ ఈ పైజామాను రెండంగుళాలు పొడవుగా కుట్టాడు. రేపే ఆఫీసర్ని దర్శించుకోవాలి… ఇదేసుకొని ఎలా పోవ